# కాళేశ్వరం జలశోభితం



ధర్మారం మండలం నందిమేడారంలోని నంది పంప్‌హౌస్ డెలివరీ సిస్టర్న్ నుంచి ఎగిసిపడుతున్న కాళేశ్వర జలాలు

- **లింక్-1లో మోటర్లకు విరామం..**
- **లింక్-2లో నంది, గాయత్రీ పంప్‌హౌస్‌లో పరవళ్లు**

పెద్దపల్లి, జూలై 19(నమస్తే తెలంగాణ)/తిమ్మాపూర్/రామడుగు/మల్యాల: కాళేశ్వరం ప్రాజెక్టులో ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. లింక్-1లోని పంపులకు బుధవారం తాత్కాలికంగా విరామం ఇవ్వగా, లింక్-2లోని నంది, గాయత్రీ పంపు హౌస్‌ల నుంచి జలాలు పరుగులు తీస్తున్నాయి. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో కాళేశ్వరం దిగువన ప్రాణహితకు 4 లక్షలకుపైగా క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో అక్కడ 47గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. కాగా, బుధవారం లింక్-2లోని నంది పంపు హౌస్‌లో 4 మోటర్లను నడిపిస్తూ అండర్ టన్నెల్ ద్వారా 12,600 క్యూసెక్కులను కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్‌హౌస్‌కు తరలిస్తున్నారు. అక్కడ నాలుగు మోటర్లను ఆన్ చేసి 12,600 క్యూసెక్కుల నీటి ఎత్తిపోస్తూ వరద కాలువ ద్వారా ఎస్సారార్ రిజర్వాయర్‌కు తరలిస్తున్నారు. నంది, గాయత్రి పంపులు జలగర్జన చేస్తుండడంతో శ్రీరాజరాజేశ్వర జలాశయానికి పరవళ్లు తొక్కి ప్రవహిస్తున్నాయి. కాగా రాష్ర్టానికి భారీ వర్ష సూచన నేపథ్యంలో ఎస్సారెస్పీ పునర్జీవ పథకంలోని రాంపూర్, రాజేశ్వర పంప్‌హౌస్‌లోని మోటర్లను నిలిపివేశారు.

**ఎల్ఎండీకి 9090 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో**

రాజన్న సిరిసిల్ల జిల్లా మాన్వాడలోని ఎస్సారార్ రిజర్వాయర్ నుంచి కరీంనగర్ జిల్లా ఎల్ఎండీ రిజర్వాయర్‌లోకి కాళేశ్వర జలాలు తరలుతున్నాయి. బుధవారం రిజర్వాయర్ గేట్లు ఎత్తి 9090క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. 24టీఎంసీల సామర్థ్యం ఉన్న ఎల్ఎండీలో ప్రస్తుతం 9.541టీఎంసీలు నీళ్లు స్టోరేజీ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

## అంజన్న క్షేత్రానికి మంచినీటి వసతి

- **సంతలోని లొద్దికి వరదకాలువ నుంచి నీటి పంపింగ్**
- **పనులకు నేడు మంత్రి ఈశ్వర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ శంకుస్థాపన**

మల్యాల, జూలై 19: కొండగట్టును యాదాద్రి తరహాలో తీర్చిదిద్దాలని కంకణం కట్టుకున్న సర్కారు మౌలిక వసతులకు పెద్దపీట వేస్తున్నది. అందులో భాగంగా ఆలయానికి నిరంతరం నీరందించేందుకు చర్యలు చేపట్టింది. అధికారుల ప్రతిపాదనల మేరకు వరద కాలువ నుంచి ఎత్తిపోతల పథకానికి ₹13.43 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో వరద కాలువ పక్కన పంప్‌హౌస్ నిర్మించి అక్కడి నుంచి మోటర్ల ద్వారా నీటిని తరలించి సంతలోని లొద్ది వద్ద కుంటను నింపుతారు. అక్కడి నుంచి ఫిల్టర్‌బెడ్ల ద్వారా నీటిని శుద్ధి చేసి కొండగట్టు దిగువన నీటిసంపునకు పంపింగ్ చేయనున్నారు. అక్కడి నుంచి ఆలయ అవసరాలకు వినియోగిస్తారు. ఈ క్రమంలో ఎత్తిపోతల పథకం పనులకు గురువారం రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శంకుస్థాపన చేయనున్నారు.

**వరదకాలువ పక్కన పంప్‌హౌస్..**

ప్రభుత్వం కొండగట్టు అంజన్న ఆలయానికి నీరందించే విషయంపై ప్రత్యేక దృష్టిపెట్టింది. ముత్యంపేటకు చెందిన పలువురు దాతలు కొండగట్టు ఆలయానికి నీరందించే సంతలోని లొద్ది(భూమిని) విరాళం ఇచ్చారు. ఇక్కడ కుంటను నిర్మించగా, నీటిని తరలించడం సాధ్యపడలేదు. దీని సామర్థ్యం 13.28 ఎంసీఎఫ్‌టీ. అయితే దీని ఆధారంగా అధికారులు పలు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారు. ముత్యంపేట శివారులోని వరద కాలువ 81 కిలోమీటర్ మైలురాయి వద్ద ఒక పంప్‌హౌస్‌ను నిర్మిస్తారు. అక్కడ 150కిలోవాట్ల సామర్థ్యం ఉన్న మోర్ల ద్వారా నీటిని ఎత్తిపోసి 1.7 కిలోమీటర్ల దూరంలో ఉన్న సంతలోని లొద్దికి తరలిస్తారు. ఇటీవలే టెండర్ ప్రక్రియ సైతం పూర్తయింది. ఈ పనులకు మంత్రి కొప్పుల, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ భూమిపూజ చేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను బుధవారం జడ్పీటీసీ కొండపలుకుల రాంమోహన్‌రావు, ఎంపీపీ మిట్టపల్లి విమల, స్థానిక సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు ఎం సుదర్శన్, మల్యాల సీఐ బిల్లా కోటేశ్వర్, ఇరిగేషన్ డీఈఈ తిరుపతి, ఏఈఈ వరాల వెంకట్ పరిశీలించారు.

## కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

**ఆ పార్టీ నేతలను కుట్రలను తిప్పికొట్టాలి**

- **మూడు గంటల కరెంట్ ఎలా సరిపోతుంది**
- **24 గంటల కరెంటిచ్చేది బీఆర్ఎస్ సర్కారే**
- **రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్**
- **నందగిరి రైతు వేదికలలో రైతులతో సమావేశం**

పెగడపల్లి, జూలై 19 : తెలంగాణ ప్రభుత్వం సాగుకు 24 గంటల నాణ్యమైన ఉచిత కరెంటును అందజేస్తున్నదని రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ స్పష్టం చేశారు. మూడు గంటల కరెంటును ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీకి రైతులు తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని కాంగ్రెస్, బీజేపీ ఓర్వలేకపోతున్నాయని, అధికారం కోసం కుట్రలు పన్నుతున్నాయని విమర్శించారు. వాళ్లు ఎన్ని కుట్రలు చేసినా రైతులు, ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. పెగడపల్లి మండలం నందగిరి రైతు వేదికలో ఆర్బీఎస్ మండల అధ్యక్షుడు ఉప్పుగండ్ల నరేందర్‌రెడ్డి అధ్యక్షతన క్లస్టర్ పరిధిలోని రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఉచిత విద్యుత్‌పై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అసహనానికి గురవుతున్నదని, అందుకే రేవంత్‌రెడ్డి దొడ్డి దారిలో ఆ పార్టీని అధికారంలోకి తేవాలని చూస్తున్నారని విమర్శించారు. ఒకవేళ అవకాశమిస్తే ఉమ్మడి రాష్ట్రంలో ఎదుర్కొన్న పరిస్థితులు పునరావృతమవుతాయని, మళ్లీ రైతులు అరిగోసపడుతారని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చినప్పుడు కేవలం 7,778 మెగావాట్ల విద్యుత్ మాత్రమే ఉండేదని, సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో దాన్ని 15,381 మెగావాట్లకు, 2023 వరకు 18563 మెగావాట్లకు పెంచారని చెప్పారు. అయినా సాగుకు 24 గంటల నాణ్యమైన కరెంట్ అందిస్తున్నామని వివరించారు. మరి కొద్ది నెలల్లో మరో 4 వేల మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి వస్తుందని, దీని వల్ల రాష్ట్రంపై కొనుగోలు భారం తప్పుతుందని తెలిపారు. దేశంలో ఎక్కడా కరెంట్ సరిగా లేదని, కాంగ్రెస్ నాయకులు రైతులకు 3 గంటల కరెంట్ చాలని ప్రచారం చేస్తుండడం హాస్యాస్పదమని, మూడు గంటల కరెంటుతో పంటలు ఎలా పండిస్తారని మంత్రి ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో రైతులకు నాణ్యమైన 24 గంటల ఉచిత వ్యవసాయ విద్యుత్‌ను అందజేస్తుందని, ఇది మరెవరి వల్లా సాధ్యంకాదని స్పష్టం చేశారు. రైతులపై కాంగ్రెస్ చేస్తున్న కుట్రలు అందరికి తెలిసిపోయాయని, వాటిని అందరూ కలిసికట్టుగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. వ్యవసాయం బాగుంటేనే, మిగిలిన అన్ని రంగాలు, ఆర్థిక వ్యవస్థ ముందుకు సాగుతుందని, దీని కోసం కేసీఆర్ వ్యవసాయ రంగాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నారని, ఈ తొమ్మిదేళ్ల కాలంలో కేవలం వ్యవసాయ రంగంపైనే 4.50 లక్షల కోట్లు ఖర్చు చేశారని మంత్రి పేర్కొన్నారు. అనంతరం క్లస్టర్ పరిధిలోని రైతులు, ప్రజాప్రతినిధులతో కలిసి రైతు వేదిక ఎదుట సీఎం కేసీఆర్ చిత్రపటానికి మంత్రి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోళి శోభా-సురేందర్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు కాసుగంటి రాజేందర్‌రావు, ఆర్బీఎస్ మండలాధ్యక్షుడు ఉప్పుగండ్ల నరేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ గాజుల గంగాధర్, సింగిల్ విండో చైర్మన్లు కర్ర భాస్కర్ రెడ్డి, మంత్రి వేణుగోపాల్, విండో వైస్ చైర్మన్ రాజశేఖర్ రావు, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజు ఆంజనేయులు, సర్పంచులు గాజుల రాకేశ్, కొండయ్య, శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, లక్ష్మణ్, ఎంపీటీసీ గంగారెడ్డి, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు మల్లారెడ్డి, వెంకన్న, మండల మహిళా అధ్యక్షురాలు సుంకరి మమత, మండల యూత్ అధ్యక్షుడు సొల్లేటి సంతోష్, పార్టీ సీనియర్ నాయకులు నారెడ్డి రాజిరెడ్డి, తోట మోహన్‌రెడ్డి, ఇరుగురాల ఆనందం, ఇనుకొండ మోహన్‌రెడ్డి, నామ సురేందర్‌రావు, కాశెట్టి సత్తయ్య, గుర్రం మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు విజయ్‌యాదవ్, సాగర్, తిరుపతి, పార్టీ మండల నాయకులు నగావత్ తిరుపతినాయక్, గాజుల గంగమల్లేశం, ఆరెల్లి లక్ష్మీరాజం, లోకేష్, శ్రీనివాస్, రాజశేఖర్‌గౌడ్, ప్రదీప్, లక్ష్మీనారాయణ, చంద్రారెడ్డి, అజయ్, కాంతయ్య, రాజేశ్వర్ రెడ్డి, కిషన్, వెంకటరెడ్డి, చందు, లచ్చయ్య, క్లస్టర్ పరిధిలోని రైతులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

కొత్తపల్లి, జూలై 19 : నగరంలోని విట్స్ క్యాంపస్‌లో గల తెలంగాణ గిరిజన సంక్షేమ బాలుర గురుకుల డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బీ లావణ్య తెలిపారు. బీజడ్సీ విద్యార్థులకు వృక్షశాస్త్ర బోధన కోసం, బీకాం(సీఏ)లో కామర్స్ బోధించేందుకు పీజీతో పాటు సంబంధిత సబ్జెక్టులో డాక్టరేట్, నెట్, సెట్ అర్హత కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వారికి పీరియడ్‌ల ప్రాతిపదికన గౌరవ వేతనం చెల్లించనున్నట్లు, ఔత్సాహికులు ఈ నెల 20లోగా కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 7901097692 నంబర్‌కు సంప్రదించాలని బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు.



### భారీ వర్షాల నేపథ్యంలో

## టీఎస్ఆర్టీసీ అప్రమత్తం

- **డ్రైవర్లు, కండక్టర్లకు జాగ్రత్తలపై సూచనలు చేసిన చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్**

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో అతి భారీ వర్షాలు కురుస్తున్న సందర్భంగా టీఎస్ఆర్టీసీ డ్రైవర్లందరూ ప్రమాదాలను నివారించాల ని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణాసంస్థ (టీఎస్ఆర్టీసీ) చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ తెలిపారు. వర్షాల నేపథ్యంలో విధి నిర్వహణలో ఏమాత్రం అలసత్వం వహించవద్దని సూచించారు. రాష్ట్రంలో వారంరోజులపాటు అతి భారీవర్షాలు కురుస్తాయ ని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో డ్రైవర్లందరూ భద్రత సూచనలు పా టించాలని కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. ఆర్టీసీ సంస్థ ఎంతో కాలంగా ప్రయాణికుల భద్రతకు మారుపేరుగా నిలిచిందన్నారు. జాతీయస్థాయిలో అతి తక్కువ ప్రమాద రేటులో అనేక అవార్డులు అందుకుందని గుర్తుచేశారు.ఆర్టీసీ సంస్థలో సుశిక్షుతులైన డ్రైవర్లున్నారని, అయినా వర్షాకాలంలో మరోసారి భద్రత నియమాలను మననం చేసుకుని తూచ తప్పకుండా పాటిస్తూ సురక్షిత డ్రైవింగ్ చేయడం అవసరమన్నారు.

**ఆర్టీసీ డ్రైవర్లు పాటించాల్సి జాగ్రత్త సూచనలు**

- వర్షం కురుస్తున్నప్పుడు వేగ నియంత్రణ పాటించాలి.
- మలుపుల వద్ద ఇండికేటర్‌ను ఉపయోగించాలి.
- ముందు వెళ్లే వాహనాలతో సురక్షిత దూరాన్ని పాటించాలి. దట్టమైన వర్షం ఉన్నచోట హారన్ ఉపయోగించాలి.
- వర్షం కురుస్తున్నప్పుడు డ్రైవింగ్ చేస్తునప్పుడు వైపర్ వాడాలి. హెడ్‌లైన్‌ను లోబీమ్‌లో ఫాగ్ లైట్స్ తప్పనిసరిగా వాడాలి. వైపర్లను కండిషన్లో ఉంచుకోగలరు.బస్సు వేగాన్ని తగ్గించి నిదానంగా వెళ్లాలి.
- చెరువులు , కుంటలు నిండిన చోట నీటి ప్రవాహాన్ని పరిశీలించి జాగ్రత్తగా వాహనాన్ని నడపాలి. నదులు, కల్వర్టులు ఎక్కువ నీటి ప్రవాహం ఉంటే ఎట్టి పరిస్థితుల్లో దాటే ప్రయత్నం చేయవద్దు.
- విండ్‌స్క్రీన్ గ్లాసులను వైపర్‌తో బయటవైపు శుభ్రపరచవలెను. లోపల వైపు ఏదైనా క్లాత్‌తో శుభ్రపరచాలి.
- డ్యూటీకి బయలుదేరుటకు ముందే వైపర్, హెడ్‌లైట్స్ పనితీరు పరిశీలించుకోవాలి. తెల్లవారుజామున 3-5 గంటల సమయంలో సమీప బస్‌స్టేషన్ నందు ఆపుకొని నీళ్లతో ముఖం, కాళ్లు, చేతులు శుభ్రపరచుకోవాలి.
- రోడ్డు మరమ్మత్తులో ఉన్నపుడు బస్సును నిదానంగా నడిపించాలి. డ్యూటీకి వచ్చే ముందు తగిన విశ్రాంతి తీసుకోవాలి.
- దట్టమైన వర్షం ఉన్న సమయంలో ఓవర్ టేక్ చేయరాదు.
- అకస్మాత్తుగా సడన్‌బ్రేక్ వేయకూడదు. వర్షం పడుతున్నప్పుడు తప్పకుండా లైట్లు వేసి వాహనాన్ని నియంత్రణలో నడపాలి.
- వర్షం కురుస్తున్న సమయంలో డ్రైవింగ్ చేయునప్పుడు ఎదురుగా వచ్చే వాహనదారులతో ప్రమాదం జరిగే అవకాశం ఉన్నది. కనుక ఎట్టి పరిస్థితుల్లో రాంగ్‌రూట్‌లో వెళ్లరాదు. సెంట్రల్ లైన్ క్రాస్ చేయరాదు. అకస్మాత్తుగా బస్సు దిశను మార్చకూడదు. అతివేగంగా బస్సును నడపరాదు.
- అకస్మాత్తుగా ఇండికేటర్ వేయడం వలన వెనుక వచ్చే వాహనాలతో ప్రమాదం జరిగే అవకాశం ఉన్నది. కనుక సడన్‌గా ఇండికేటర్ వేయకూడదు. బ్రేక్ సిస్టమ్ నుంచి ఎలాంటి ఎయిర్ లీకేజీలు ఉన్నాయో గమనించాలి. ఘాట్‌రోడ్డు ప్రయాణంలో ఎట్టి పరిస్థితుల్లోనూ బస్సును న్యూట్రల్ చేసి నడపకూడదు.
- హైదరాబాద్ నగర శివారులో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలి. నగరంలో మ్యాన్‌హోల్స్ , రద్దీ ప్రదేశాలలో కండక్టర్ సహాయంతో వాహనాన్ని నడపాలి.
- బస్సులో పుట్‌బోర్డు ప్రయాణాన్ని నివారించాలి. పుట్‌బోర్డులో ఉన్న ప్రయాణికులను బస్సు లోపలికి చేర్చుకోవాలి.
- ఫోన్ మాట్లాడుతూ..ఒంటిచేత్తో డ్రైవింగ్ చేయవద్దు. అతి భారీ వర్షాలు కురుస్తున్న సందర్భంగా తడిసిన కరెంటు స్తంభాలను ముట్టుకోరాదు.తడి చేతులతో విద్యుత్ ప్రవాహం ఉన్న స్విచ్ బోర్డులను తాకరాదని సూచించారు. ఎంతో పేరున్న ఆర్టీసీ సంస్థ.. ప్రయాణికులకు ఎలాంటి అసౌకార్యలు కలగకుండా, డ్రైవర్లు, కండక్టర్‌లు సురక్షితంగా బస్సులు నడిపి..ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకొని సంస్థకు సహకరించాలని టీఎస్ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ సూచనలు జారీ చేశారు.